క్లుప్తంగా

చందోలు ఎస్‌ఐగా వెంకట శివకుమార్



కర్లపాలెం: చందోలు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా ఎం.వెంకటశివకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన వీఆర్ నుంచి వచ్చారు. ఇప్పటిదాకా ఎస్‌ఐగా పనిచేసిన ఆర్.స్వామి శ్రీనివాస్ వీఆర్‌కు వెళ్లారు. ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన అనంతరం వెంకట శివకుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం



నిజాంపట్నం: ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నీరు వృథా చేయకుండా, చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సేవలు ఎనలేనివి



రేపల్లె రూరల్: పట్టణంలోని నెహ్రూ బొమ్మ సెంటరులో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన శివప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమాజ సేవలను కొనియాడారు. భవిష్యత్‌లో మరింత విస్తృతం చేయాలని కోరారు. అనంతరం ప్రజలకు తాగునీరు, మజ్జిగలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కళ్లేపల్లి ఈశ్వరరావు, సంఘ నాయకులు తుమ్మలపల్లి శివ, తడికమళ్ల బాలు, సుగ్గుల సుదర్శనరావు, మహేష్ గుప్త, ఆలపాటి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు అర్జీలు



రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు అర్జీలు అందినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి తెలిపారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సర్వేపై రెండు, ఆక్రమణల తొలగింపుపై ఒకటి, భూమి సమస్యపై ఒకటి, అడంగల్ సమస్యపై ఒకటి, ఆన్‌లైన్ సమస్యలపై రెండు చొప్పున అర్జీలు అందాయని చెప్పారు. ఆయా సమస్యలను పరిశీలించి సంబంధిత శాఖ అధికారుల ద్వారా త్వరితగతిన పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

పుచ్చ చేలల్లో 'సిరి'గమలు

- లాభాలు కళ్ల జూస్తున్న రైతులు
- బాపట్లలో 200 ఎకరాల్లో సాగు చేస్తున్న రైతులు
- ఖర్చు తక్కువ..లాభాలు ఎక్కువ
- పట్టణంలో ఊపందుకుంటున్న వ్యాపారం
- సీజన్‌లో రూ.లక్షల్లో సాగుతున్న లావాదేవీలు

ఎండలు ముదరగానే అందరికీ గుర్తుకొచ్చేది పుచ్చ కాయ. భగభగమని భానుడు ప్రతాపం చూపుతున్న వేళ ఒక్క ముక్క తింటే లభించే ఊరటే వేరు. శరీర ఉష్ణోగ్రతను వెంటనే క్రమబద్ధీకరించి లవణాలను అందించడంలో పుచ్చకాయ మొదటి స్థానంలో ఉంటుంది. ప్రస్తుతం బాపట్ల పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రత 35 నుంచి 40 డిగ్రీల సెంటీగ్రేడ్ మధ్యలో ఉండటంతో కాయలకు డిమాండ్ భారీగా పెరిగింది. అటు రైతులు, ఇటు వ్యాపారులు అవకాశాన్ని అందిపుచ్చుకుని లాభాలు గడిస్తున్నారు.



బాపట్లలో పుచ్చకాయల అమ్మకం

బాపట్ల కేవలం బయట తిరిగేవారే కాదు.. ఇళ్లల్లో ఉన్నవారు కూడా ఎండాకాలం పుచ్చకాయలు తినేందుకు ఉవ్విళ్లూరుతుంటారు. తీయదనంతోపాటు చల్లగా ఉండటం వలన పెద్దలు, పిల్లలు మక్కువ చూపుతుంటారు. ఇటీవల ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరగడంతో శరీరాన్ని చల్లగా చేసుకునేందుకు సామాన్యుడి నుంచి ధనవంతుడి వరకు పుచ్చకాయలు కొనుగోలు చేస్తున్నారు.



పాండురంగాపురంలో సాగు చేస్తున్న పుచ్చ

సాగు ఎంతో సులభం

పుచ్చకాయ సాగు కోసం ఎకరాకు అరకేజీ విత్తనాలు నాటాలి. విత్తన ధర కిలో రూ. 4 వేలు నుంచి రూ.6 వేలు ఉంటుంది. జనవరి నుంచి మార్చి నెలలో సాగు చేసుకోవచ్చు. విత్తిన ప్పటి నుంచి 90 రోజుల్లో కాపు చేతికి అందుతుంది. ఎకరా సాగుకు సుమారు రూ. 25 వేలు నుంచి రూ.30 వేలు పెట్టుబడి అవుతుంది. ఎకరాకు 8 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. టన్ను పుచ్చకాయలు రూ. 6 వేలు నుంచి రూ. 11 వేలు వరకు ధర పలుకుతుంది. ప్రతి వారం నీటి తడులు ఇవ్వాల్సి ఉంటుంది. తేలికపాటి, ఇసుక నేలలు సాగుకు అనుకూలం. వేసవిలో పుచ్చ సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. మొదట్లో నియోజకవర్గంలో నాలుగైదు ఎకరాలు మాత్రమే పండించేవారు. ప్రస్తుతం ఒక్క బాపట్ల మండలంలోని మరుప్రోలువారిపాలెం, పాండురంగాపురం, పిన్నిబోయినవారిపాలెం, వల్లువారిపాలెం గ్రామాల్లోనే సుమారు 150 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

భారీగా పెరిగిన వ్యాపారం

మండుతున్న ఎండల తాపాన్ని దృష్టిలో పెట్టుకున్న చిరు వ్యాపారులు తోపుడుబండ్లపై పుచ్చకాయలు విక్రయిస్తున్నారు. గడిచిన పది రోజుల వ్యవధిలో బాపట్ల పట్టణంలో సుమారు 150 మందికిపైగా వ్యాపారానికి శ్రీకారం చుట్టారు. బాపట్ల నియోజకవర్గంలోని కర్లపాలెం, పిట్టలవానిపాలెం, బాపట్ల మండలాల్లో పుచ్చకాయల దుకాణాలు 200 పైగా వెలిశాయి. ధరలు కూడా పేదవారికి అందుబాటులో ఉండటంతో కొనుగోళ్లు భారీగా పెరిగాయి. ప్రధానంగా జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలైన రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, ఆటోస్టాండ్‌లు, ప్రధాన రహదారుల వెంబడి విక్రయిస్తున్నారు. సీజన్ ముగిసేలోపు రూ. లక్షల్లో వ్యాపారాలు జరుగుతాయి.

వైభవంగా రామయ్య పట్టాభిషేకం



హనుమంతుని వేషధారణలో చిన్నారులు



సత్సంగ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



కర్లపాలెంలో పూజలందుకున్న సీతారాముల ఉత్సవ విగ్రహాలు

నగరం: శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా సోమవారం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని మండలంలోని కొలగానివారిపాలెం శ్రీరామ మందిరంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ జరిగిన కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కల్యాణం జరిగిన మరుసటి రోజు అనవాయితీగా పట్టాభిషేకం చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో చిన్నారులు హనుమంతుని వేషధారణలతో గ్రామ వీధుల్లో చేసిన ప్రదర్శనలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో అన్నసమారాధనలు ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా సంకీర్తన సత్సంగ్ మహోత్సవం

చెరుకుపల్లి: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలంలోని పొన్నపల్లి రామాలయంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం భజన సంకీర్తన సత్సంగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ శ్రీరాముని జీవితం భారతీయులకు ఆదర్శనీయమని తెలిపారు. ఆయన చూపిన దాంపత్య, సత్యమార్గాలలో నడిచేందుకే సీతారామ కల్యాణ మహోత్సవాలు జరుపుకుంటామని సూచించారు. అనంతరం టీటీడీ నుంచి వచ్చిన పసుపుకుంకుమ, అక్షింతలను భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ ఆవరణలో సంకీర్తనలు, భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ, కోటేశ్వరరావు, పడమట వెంకటేశ్వరరావు, చింతల మురళీకృష్ణ, అర్చకులు నంబూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో..

శ్రీరామనవమి వేడుకలలో భాగంగా సోమవారం శ్రీరాముని పట్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. కర్లపాలెం సెంటర్‌లోని కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. పట్టాభిషేకం పూజల్లో భాగంగా సముద్ర, నదీ జలాలలో పాటు స్థానికంగా ఎనిమిది దిక్కుల నుంచి బిందెలతో నీరు తీసుకువచ్చి జలాభిషేకం చేశారు. అనంతరం విఘ్నేశ్వర పూజ, పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర శతనామావళి పూజలు చేసి హారతులిచ్చి, నైవేద్యం సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిరాణా మర్చంట్ అసోసియేషన్ సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



కర్లపాలెం: అగ్ని ప్రమాద బాధితులకు దాతలు అండగా నిలవాలని బాపట్ల అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ తెలిపారు. ఆదివారం నల్లమోతువారిపాలెంలో ప్రమాదవశాత్తు పూరిల్లు దగ్ధమై రాచూరి సాంబయ్య నిరాశ్రయుడయ్యాడు. అతడికి సోమవారం అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ రూ. 10వేల నగదు, వంటపాత్రలు, దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఆరు నెలల కిందట భార్య చనిపోయి ఇబ్బందులు పడుతున్న సాంబయ్య ఇల్లు కాలిపోవడం బాధాకరమనిన తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సురేష్ కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గరిగంటి శ్రీనివాసరావు, కావూరి అంజనేష్, తులసీకుమారి, మహేష్, వినోద్, రాజశేఖర్‌రెడ్డి, మాడసాని బాలాజీ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణ సిబ్బంది బాధ్యత



చుండూరు(వేమూరు): ప్రజలకు మంచి ఆరోగ్య అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కృష్ణవేణి తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా చుండూరు మండలంలోని వేటపాలెం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సోమవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జీవన శైలికి సంబంధించిన వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. నూనె, చక్కెర, ఉప్పు, ఫాస్ట్‌ఫుడ్ జోలికి వెళ్లకుండా ఆకుకూరలు, పోషక విలువలు ఉన్న సమతుల ఆహారాన్ని తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, నర్సులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి గ్రామోత్సవం

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలో ఆదివారం రాత్రి మల్లేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి వార్ల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణ దేవరాయ కాపు కమిటీ ఆధ్వర్యంలో ఒకే వాహనంపై స్వామివార్లను అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు దర్శించుకుని టెంకాయలు కొట్టి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా !

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్



చినబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గణేష్

నగరం: పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ చెప్పారు.నగరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త అసోది చినబాబు ఇటీవల ఆటో ప్రమాదంలో మృతి చెందారు. సోమవారం నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో గణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నబాబు మృతి బాధాకరమని, కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. తొలుత చినబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థికసాయం చేశారు.ఆయన వెంట మండల కన్వీనర్ రామకృష్ణ, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పాగోలు వెంకటేశ్వరావు,నాయకులు ఉన్నారు.

సాధారణ కాన్పుతోనే తల్లీబిడ్డా క్షేమం



మాట్లాడుతున్న ప్రసూతి వైద్య నిపుణురాలు శ్వేత

రేపల్లె రూరల్: సాధారణ కాన్పులోనే తల్లీబిడ్డా క్షేమంగా ఉంటారని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ సుధాకర్ అన్నారు. సాధారణ కాన్పులతో కలిగే లాభాలు, ఆపరేషన్‌లతో కలిగే దుష్పరిణామాలపై పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యశాల సిబ్బంది, ప్రజలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధారణ కాన్పు అనంతరం మహిళలకు త్వరితగతిన సంపూర్ణ ఆరోగ్యం చేకూరడంతో పాటు రోజువారి పనుల్ని సునాయాసంగా చేసుకోవచ్చని తెలిపారు. ప్రసూతి వైద్య నిపుణురాలు శ్వేత మాట్లాడుతూ 2023–24లో వైద్యశాలలో 400లకు పైగా కాన్పులు చేశామని, ఇందులో 50శాతానికి పైగా సాధారణ కాన్పులే జరిగాయని వెల్లడించారు. గర్భిణులు పౌష్టికాహారంతో పాటు చిన్న వ్యాయామాలు తరచూ చేయడంతో సుఖప్రసవం అయ్యేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. నెలనెలా క్రమం తప్పకుండా సంబంధిత వైద్యుల పర్యవేక్షణలో అవసరమైన మందులు, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఆపరేషన్ ద్వారా కాన్పు జరిగితే కలిగే ఆరోగ్యపరమైన నష్టాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు పృథ్వీ గణేష్, జీవన్, సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా

- సమావేశానికి హాజరు కాని ఎంపీటీసీ సభ్యులు
- కోరం లేకపోవడంతో వాయిదా

చుండూరు(వేమూరు) : ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంతో చుండూరు మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో సుదీప తెలిపారు. సమావేశాన్ని సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభించారు. 4.30 గంటల వరకు వేచి చూసినా సభ్యులు హాజరుకాలేదు. కోరం లేక వాయిదా వేస్తున్నట్లు ఆమె తెలిపారు. మరలా తేదీని ప్రకటిస్తామని ఆమె పేర్కొన్నారు. మండలంలో మొత్తం ఎంపీటీసీ సభ్యులు 13 మంది ఉన్నారు. ఇందులో మందూరు ఎంపీటీసీ మాత్రమే హాజరైనట్లు ఎంపీడీవో ఆమె తెలిపారు.

నిబంధనలకు పాతర

ఎంపీపీ ఆదేశాల మేరకు అధికారులు నిబంధనలను తుంగలో తొక్కారు. వాస్తవానికి ఎంపీటీసీ సభ్యులు హాజరు పట్టికలో సంతకాలు చేయాలి. నిబంధనలకు వ్యతిరేకంగా ఎంపీపీ హాజరు పట్టికను ఎంపీటీసీ ఇళ్లకు తీసుకెళ్లారు. అయితే, వారు పెట్టకపోవడంతో మండల ప్రజా పరిషత్ అధికారులకు అప్పగించారు. కోరం కోసం ఎంపీపీ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించినట్లు పలువురు ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు.

నిబంధనలకు విరుద్ధంగా సైకిల్ స్టాండ్ తొలగింపు



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

బాపట్ల: నిబంధనలకు విరుద్ధంగా రైల్వేస్టేషన్ దగ్గర సైకిల్ స్టాండ్‌ను తొలగించారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిని సోమవారం కలిసి వినతి పత్రం అందించారు. వివాదం కోర్టులో ఉండగా కొంతమంది రౌడీయిజంగా వచ్చి నర్రావుల వెంకట్రావుకు చెందిన స్టాండ్‌ను తొలగించారని పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఆయన పరిశీలించి ఇందులో క్రిమినల్ కంటెంట్ కనిపిస్తోందని, జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకు వెళ్లాలని సూచించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు హరిబాబు, పందరబోయిన సుబ్బారావు, మరుప్రోలు ఏడుకొండలురెడ్డి, జోగి రాజా, సోహిత్ యాదవ్,చల్లా రామయ్య, శాయిల మురళి ఉన్నారు.

అక్రమ అడ్మిషన్లు నిలిపివేయాలి

ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్



మాట్లాడుతున్న వెంకటేష్

తెనాలిఅర్బన్: నియోజకవర్గ పరిధిలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం వెంకటేష్ ఆరోపించారు. గాంధీనగర్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వేసవి సెలవులను ప్రకటించినప్పటికీ కొన్ని విద్యాసంస్థల వారు తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనివల్ల విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి అలాంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గుండు శివ, పట్టణ కార్యదర్శి చెన్నూరి సాయి, నాయకులు పాశం చెక్కిరి, షేక్ పండు, మద్దినేని బాబు, దాసరి ఇర్మియా, పవన్, కొట్లు గోపి పాల్గొన్నారు.

వ్యక్తిగత రుణాలను సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఉద్యోగులు

తెనాలి అర్బన్: ప్రభుత్వం అందించే వ్యక్తిగత రుణాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న సూచించారు. కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో వ్యక్తిగత రుణాలకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలనను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సామాజిక వర్గాల నిరుద్యోగులకు సబ్సిడీపై వ్యక్తిగత రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వాటి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం సర్టిఫికెట్ల పరిశీలన జరిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, 27వ వార్డు కౌన్సిలర్ బోయపాటి అరుణ, మెప్మా సీఎంఎం విజయ, ఆర్‌వో రాంప్రసాద్, డీఈ సుబ్బారావు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో సమస్యల కూత

- వేమూరు రైల్వే స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కరువు
- ప్రయాణికులకు అవస్థలు



వేమూరు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం

వేమూరు: నిత్యం ప్రయాణికులతో కళకళలాడే వేమూరు రైల్వే స్టేషన్‌లో సమస్యలు తిష్ట వేశాయి. కనీస సౌకర్యాలు కూడా కరువై ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు.తాగు నీరు, మరుగుదొడ్ల వసతి లేదు. కరోనా సమయంలో ముందే టికెట్లు ఇచ్చే విధానాన్ని ప్రైవేటు పరం చేశారు. అప్పటి నుంచి రైల్వే స్టేషన్‌లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. రైల్వే అధికారులు కూడా పట్టించుకోవడం మానేశారు. సికింద్రాబాద్ నుంచి రేపల్లెకు ప్యాసింజరు, రేపల్లె నుంచి సికింద్రాబాద్‌కు పాస్ట్ ప్యాసింజరు స్టాప్ ఉండటంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఆదాయంపై దృష్టి పెట్టిన రైల్వే అధికారులు వసతుల గురించి పట్టించుకోవడం మానేశారు.

గొంతు తడుపుకోవడానికి నీరు కూడా కరువు

రైల్వే స్టేషన్‌లో కనీస వసతులు కరువయ్యాయి. ప్లాట్ ఫారంపై కనీసం తాగునీటి కుళాయిలు కూడా ఏర్పాటు చేయలేదు. వేసవిలో గొంతు తడుపుకోవడానికి చుక్క నీరు కూడా లేదు. మరుగు దొడ్లకు రైల్వే అధికారులు తాళాలు వేయడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. డెల్టా ప్యాసింజరుకు వెళ్లేందుకు కొల్లూరు, వేమూరు మండలాల్లో వివిధ గ్రామాలకు చెందిన ప్రయాణికులు ముందే స్టేషన్‌కు వచ్చి ఉంటారు. మరుగు దొడ్లకు తాళాలు వేయడంతో వీరంతా ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అధికారులు స్పందించి స్టేషన్‌లో తాగునీటి వసతితో పాటు మరుగు దొడ్డకు తాళాలు తీయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మరుగు దొడ్లకు తాళాలు

రైల్వే అధికారులు స్పందించాలి



రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారంపై ఒక్క కుళాయి కూడా లేదు. వేసవిలో తాగు నీరు కోసం నానా ఇక్కట్లు పడుతున్నాం. రైల్వే అధికారులు స్పందించి స్టేషన్‌లో వసతులు కల్పించాలి.

–కోగంటి సురేష్, జంపని, వేమూరు మండలం

మరుగు దొడ్లు లేక అవస్థలు



నిత్యం రద్దీగా రైల్వే స్టేషన్‌లో మరుగు దొడ్లకు తాళాలు వేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆడవారి అవస్థలు అన్నీఇన్నీ కావు. రైల్వే అధికారులు స్పందించి తాళాలు తీయించాలి.

–తోడేటి సురేష్, చింతర్లంక, కొల్లూరు మండలం.

పేదలకు రెండు సెంట్ల స్థలాన్ని కేటాయించాలి

సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు



తెనాలి అర్బన్: పట్టణంలో నిరుపేదలకు రెండు సెంట్ల స్థలాన్ని కేటాయించి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు విడుదల చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో సోమవారం ఇంటి స్థలాల అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెనాలి పరిసర ప్రాంతాల్లో ఇల్లులేని నిరుపేదలు చాలా మంది ఉన్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. వెంటనే దానిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పరుచూరి వెంకటేశ్వరరావు, బొల్లిముంత కృష్ణ, రాజేష్, తేజ, తదితరులు పాల్గొన్నారు.